నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence

www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

**టెక్ట్రో కు అవార్డు**

హైదరాబాద్‌కు చెందిన టెక్ట్రో కన్సల్టింగ్ సంస్థకు గూగుల్ నుంచి ప్రతిష్ఠాత్మక గ్రోత్ యాక్సిలరేటర్ అవార్డు లభించినట్లు కంపెనీ జూన్ 20న వెల్లడించింది. ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్‌లో విశేషమైన సహకారం అందించినందుకు ఈ అవార్డు దక్కింది. జూన్ 5న లండన్‌లో జరిగిన ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజ్ గ్లోబల్ పార్ట్‌నర్ సమ్మిట్‌లో ఈ అవార్డును టెక్ట్రో ఎండీ శ్రీధర్ అందుకున్నారు.

nipuna
Every Wednesday Free Supplement
07.
4 సెప్టెంబర్ 2024
పేజీలు 8

# మిషన్ ఇంద్రధనస్సు.. ఆరోగ్య భవిష్యత్తుకు ఉషస్సు

**గ్రూప్-1 మెయిన్స్**
**పేపర్-V (సైన్స్ అండ్ టెక్నాలజీ)**

### భారతదేశం - టీకా కార్యక్రమం (Vaccination Programme in India)

- వివిధ రకాల రోగాలను నివారించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) 1974లో టీకా కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రపంచ దేశాలకు తెలియజేసింది. 1978లో భారత ప్రభుత్వం కొన్ని రకాల ప్రాణాంతక వ్యాధుల (డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింత దగ్గు, టీబీ, పోలియో) నుంచి పిల్లలను రక్షించేందుకు ఈపీఐ (Expanded Programme of Immunization) అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. 1990 నాటికి గర్భిణులు, పిల్లలకు ఉచితంగా టీకాలు అందించడమే లక్ష్యంగా ఈ ఈపీఐని ప్రారంభించారు. 1978-ఈపీఐ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేసేందుకు భారత ప్రభుత్వం 1985లో భారత విశ్వజనీన టీకా కార్యక్రమాన్ని (Universal Immunization Programme-UIP) తీసుకొచ్చింది. దీనిలో భాగంగా 7 రకాల ప్రాణాంతక వ్యాధు (డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింత దగ్గు, టీబీ, పోలియో, మీజిల్స్, హెపటైటిస్)ల నుంచి రక్షణ కల్పించాలని భావించింది. 1990 నాటికి దేశంలోని 85 శాతం పిల్లలకు టీకాలను అందించడం, టీకాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించడం అనే లక్ష్యంలో UIP-1985 పని ప్రారంభించింది.
- భారత ప్రభుత్వం 1986లో టీకాల గురించి సాంకేతిక మిషన్ (Technology Mission on Immunization-1986)ను ఏర్పాటు చేసి 0-12 నెలల్లోపు చిన్నారులకు అందించాల్సిన టీకాలను అందించే ప్రయత్నం చేసింది. అంతేకాకుండా 1992లో CSSM(Child Servival and Safe Motherhood) అనే కార్యక్రమాన్ని తీసుకొని దీనిలో UIP, Safe Motherhood కార్యక్రమాలను అమలు పరిచింది. ఆ తర్వాత 1997లో Reproducting Child Health (RCH-1) కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ఆ తర్వాత 2005లో జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (National Rural Health Mission- NRHM) తీసుకొచ్చి టీకాలు ఇవ్వడాన్ని దీని కిందకే అమలు చేశారు. ఈ NRHMలో భాగంగా ప్రారంభంలో డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింత దగ్గు, టీబీ, పోలియో, మీజిల్స్, డయేరియా, న్యుమోనియా, హెపటైటిస్-బి (2007 నుంచి) వ్యాధులకు టీకాలు ఇవ్వగా 2014 నుంచి వీటికి అదనంగా మరో 4 వ్యాధుల (రొటావైరస్, రుబెల్లా, జపనీస్ ఎన్‌సెఫలైటిస్, ఇంజెక్షన్ రూపంలో పోలియో టీకా) కు టీకాలు అందించారు.

### మిషన్ ఇంద్రధనస్సు (Mission Indradhanush-2014)

- రెండు సంవత్సరాల్లోపు పిల్లలు, గర్భిణులకు అందుబాటులో ఉన్న టీకాలను, 2020 నాటికి 90 శాతం చిన్నారులకు, గర్భిణులకు టీకీకరణ (Vaccination)ను పూర్తి చేయడమే లక్ష్యంగా భారత ప్రభుత్వం పూనుకుంది. ఈ కార్యక్రమాన్ని నాటి కేంద్ర ఆరోగ్య మంత్రి 2022, డిసెంబర్ 25న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 7 రంగులను సూచించే విధంగా 7 ప్రాణాంతక వ్యాధుల (డిఫ్తీరియా, కోరింత దగ్గు, ధనుర్వాతం, పోలియో, క్షయ, మీజిల్స్, హెపటైటిస్-బి) నుంచి రక్షణ కల్పించడం కోసం టీకాలను అందించాలని నిర్ణయించారు. వీటికి అదనంగా ఎంపిక చేసిన రాష్ట్రాల్లో జపనీస్ ఎన్‌సెఫలైటిస్ (జేఈ), హీమోఫీలస్ ఇన్‌ఫ్లూయెంజా (టైప్-బి) వ్యాధుల నుంచి రక్షణ కల్పించడం కోసం టీకాలను అందించాలని నిర్ణయించారు.
- ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా దాదాపు 50 శాతం పిల్లలకు టీకాలు అందని 201 జిల్లాల్లో అమలు చేస్తున్నారు. మిషన్ ఇంద్రధనస్సు రెండో దశ కార్యక్రమాన్ని 2015, అక్టోబర్ 7 నుంచి దేశంలోని 297 జిల్లాల్లో ప్రారంభించారు. 2016 నుంచి ఈ మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా మరో 4 రకాల వ్యాధులను నివారించడానికి టీకాలను అందిస్తున్నారు. అవి.. రుబెల్లా, జపనీస్ ఎన్‌సెఫలైటిస్, ఇంజెక్టబుల్ పోలియో వ్యాక్సిన్ బై వాలెంట్, రొటావైరస్, 2017 నుంచి న్యుమోనియా వ్యాధికి నిరోధకత కల్పించేందుకు న్యుమోకోకల్ కాంజుగేట్ వ్యాక్సిన్ UIPలో భాగంగా ఇస్తున్నారు.

### ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు (Intensified Mission Indradhanush)

- మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయడానికి 2017, అక్టోబర్ 8న ప్రధాని మోదీ ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2020 నాటికి 90 శాతం పిల్లలు, గర్భిణులకు టీకాలను అందించాలనుకున్న లక్ష్యాన్ని 2018, డిసెంబర్ నాటికి చేరుకోవాలని ఈ కార్యక్రమాన్ని తీసుకున్నారు. దీన్ని ఎంపిక చేసిన 173 జిల్లాల్లో అమలు చేశారు.
- దేశంలోని అన్ని రాష్ట్రాల్లో 381 జిల్లాల్లో సంపూర్ణ ఇమ్యూనైజేషన్ (టీకాలు ఇవ్వడం)ను సాధించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు-2.0 కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి హర్షవర్ధన్ 2020, ఫిబ్రవరిలో ప్రారంభించారు.
- రొటీన్ ఇమ్యూనైజేషన్ (టీకాలు వేయడం కార్యక్రమంలో భాగంగా కొవిడ్-19 పాండమిక్ కారణంగా టీకాలు వేయని గర్భిణులు, పిల్లలకు టీకాలు వేయడం కోసం ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు-3.0 కార్యక్రమాన్ని 2021, ఫిబ్రవరి నుంచి 2021 మార్చి వరకు నిర్వహించి 9.5 లక్షల చిన్నారులు, 2.2 లక్షల గర్భిణులకు టీకాలు ఇచ్చినట్లుగా కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి భారతి ప్రవీణ్ తెలిపారు.
- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ 2022, ఫిబ్రవరి 7న ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు-4.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలోని 416 జిల్లాల్లో 2022, ఫిబ్రవరి నుంచి మే వరకు నిర్వహించారు. దేశంలో అందుబాటులో ఉన్న టీకాలు ఇప్పటి వరకు అందని పిల్లలు, గర్భిణులకు ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.




### వివిధ రకాల వ్యాధులు - అందుబాటులో ఉన్న టీకాలు

| టీకా (Vaccine) | వ్యాధి (Disease) |
|---|---|
| BCG | క్షయ (Tuberculosis) |
| HEP-B | హెపటైటిస్-బి |
| Polio | పోలియో మైలిటిస్ |
| DTP | కంఠవాపు (Diphtheria), ధనుర్వాతం (Tetanus), కోరింత దగ్గు (Pertusis) |
| Hib | హీమోఫీలస్ ఇన్‌ఫ్లూయెంజా-బి |
| Varicella | ఆటలమ్మ (వారిసెల్లా) |
| Pnumococcal (PCV) | న్యుమోకోకల్ |
| Rotavirus | రొటావైరస్ |
| MMR | తట్టు (Measles), గవదబిళ్లలు (Mumps), రుబెల్లా (Rubella) |
| HPV | గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ |
| Anthrax | ఆంత్రాక్స్ |
| Influenza (IIV) | ఇన్‌ఫ్లూయెంజా |
| Rabisin | రేబిస్/ Hydrophobia |
| Hepatitis-A | హెపటైటిస్-ఎ |
| Covishield, Covaxin, Sputnik-V, Corbevax | కొవిడ్-19 |
| Typhoid, Conjugated | టైఫాయిడ్ |

IAP (Indian Academy of Pediatrics) ఇమ్యూనైజేషన్ షెడ్యూల్- 2020-21

- 0-18 సంవత్సరాల్లోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాల జాబితాను ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) అడ్వైజరీ కమిటీ ఆన్ వ్యాక్సిన్స్ అండ్ ఇమ్యూనైజేషన్ ప్రాక్టీసెస్ (ఏసీవీఐపీ)-2020-21ని కింద పట్టికలో చూద్దాం.

| వయస్సు | టీకాలు |
|---|---|
| పుట్టినప్పుడు | బీసీజీ, ఓపీవీ, హెచ్‌ఈపీ-బి-1 |
| 6 వారాలు | డీటీపీ-1, ఐపీవీ-1, హెచ్‌ఐబి-1, హెచ్‌ఈపీ-బి-2, రొటా వైరస్-1, పీసీవీ-1 |
| 10 వారాలు | డీటీపీ-2, ఐపీవీ-2, హెచ్‌ఐబీ-2, హెచ్‌ఈపీ-బి-3, రొటావైరస్-2, పీసీవీ-2 |
| 14 వారాలు | డీటీపీ-3, ఐపీవీ-3, హెచ్‌ఐబి-3, హెచ్‌ఈపీ-బి-4, రొటావైరస్-3, పీసీవీ-3 |
| 6 నెలలు | ఇన్‌ఫ్లూయెంజా (ఐఐవీ)-1 |
| 7 నెలలు | ఇన్‌ఫ్లూయెంజా (ఐఐవీ)-2 |
| 6-9 నెలలు | టైఫాయిడ్ కాంజుగేటెడ్ |
| 9 నెలలు | ఎంఎంఆర్-1 |
| 12 నెలలు | హెపటైటిస్-ఎ |
| 15 నెలలు | ఎంఎంఆర్-2, వారిసెల్లా-1, పీసీవీ బూస్టర్ |
| 16-18 నెలలు | డీటీపీ-బి1, హెచ్‌ఐబీ-బి1, ఐపీవీ-బి1 |
| 18-19 నెలలు | హెచ్‌ఈపీ ఎ-2, వారిసెల్లా-2 |
| 4-6 సంవత్సరాలు | డీటీపీ-బి2, ఐపీవీ-బి2, ఎంఎంఆర్-3 |
| 10-12 సంవత్సరాలు | టీడీఏపీ, హెచ్‌పీవీ |

గమనిక: పై పట్టికలోని 1 మొదటి డోస్, 2 రెండో డోస్, 3 మూడో డోస్, 4 నాలుగో డోస్, బి1 మొదటి బూస్టర్ డోస్, బి2 రెండో బూస్టర్, ఐఐవీ ఇనాక్టివేటెడ్ ఇన్‌ఫ్లూయెంజా వ్యాక్సిన్‌ను, టీడీఏపీ టెటానస్, డిఫ్తీరియా అండ్ పెర్టుసిస్‌ను సూచిస్తాయి.

### టీకాలు ఇవ్వకూడని/ తీసుకోకూడని సందర్భం

- అధిక జ్వరం, న్యుమోనియా, డయేరియా లాంటి వ్యాధులు ఉన్నప్పుడు అంటే తీవ్ర అనారోగ్యంతో ఉన్నప్పుడు, నాడీ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నప్పుడు, క్యాన్సర్ వచ్చినప్పుడు, ఎక్స్ రే కిరణాలతో వైద్యం చేయించుకున్నప్పుడు, అంటువ్యాధులను ఎదుర్కొనే శక్తి లేనప్పుడు టీకాలు ఇవ్వకూడదు/ తీసుకోకూడదు. కోడిగుడ్ల అలర్జీ ఉన్నవారు ఎంఎంఆర్ టీకా తీసుకోకూడదు.

### టీకాల ఉపయోగాలు

- టీకా అనేది వ్యాధి రాకుండా ముందస్తుగా తీసుకునే మందు. అంటే టీకాలు రోగాలు రాకుండా నివారిస్తాయి. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే వ్యాధి రాకుండా టీకాలు తీసుకొని నివారించుకోవడం సులభమైనది (Prevention is better than cure). వ్యాక్సిన్‌లు తీసుకోవడం వల్ల క్షయ, హెపటైటిస్-ఎ, బి, పోలియో, కంఠవాపు, ధనుర్వాతం, కోరింతదగ్గు, హీమోఫీలస్ ఇన్‌ఫ్లూయెంజా, ఆటలమ్మ, న్యుమోకోకల్ వ్యాధి, తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, ఆంత్రాక్స్, ఇన్‌ఫ్లూయెంజా, రేబిస్, టైఫాయిడ్, కొవిడ్-19 లాంటి వ్యాధులు రాకుండా రక్షణ పొందవచ్చు.
- టీకాలు తీసుకోవడం వల్ల పిల్లల్లో అంగవైకల్యం రాకుండా చూడవచ్చు. టెటానస్ టీకా వల్ల గర్భిణులు, పిల్లల్లో మరణ రేటును నివారించవచ్చు. టీకా జీవితాంత రక్షణను ఇస్తుంది. కాబట్టి టీకాలు తీసుకోవడం గురించి అందరికీ అవగాహన ఉండాలి. పెద్దవాళ్లు టీకా తీసుకుంటే కొవిడ్-19, హెపటైటిస్-బి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా రక్షించుకోవచ్చు.

డాక్టర్ మోదాల మల్లేష్
విషయ నిపుణులు
పాలెం, నకిరేకల్,
నల్లగొండ 9989535675

